ఎలివేటెడ్ కారిడార్లను ఎలా చేద్దాం?

ట్రాన్సాక్షన్ అడ్వైజర్ల నియామానికి కసరత్తు

నిధుల సేకరణ, రెవెన్యూ సాధ్యాసాధ్యాలపై సలహాదారుల అధ్యయనం

ఆర్థిక వనరులు, రెవెన్యూతో పాటు, ప్రాజెక్టు వ్యయ, ఆదాయాలపై కమిటీ అంచనా

సిటీబ్యూరో, జూలై 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌కు తలమానికం కానున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లను ఎలా నిర్మిద్దామనే విషయంలో హెచ్ఎండీఏ మల్లగుల్లాలు పడుతుంది. ప్రాజెక్టు ఖర్చు, నిర్మాణ వ్యయం, రెవెన్యూ వంటి విషయాల్లో మరింత లోతుగా తెలుసుకోవాలని భావిస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా ట్రాన్సాక్షన్ అడ్వైజర్లను నియమించుకునేందుకు హెచ్ఎండీఏ కసరత్తు చేస్తోంది. జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ వరకు, అదే విధంగా ప్యారడైజ్ నుంచి డెయిర్ ఫాం రోడ్డు వరకు నిర్మించనున్న రెండు ఎలివేటెడ్ కారిడార్లకు ఆర్థికంగా తుది రూపు తీసుకువచ్చేలా సలహాదారులను నియమించుకోనుంది. ఇప్పటికే టీపీఏల విషయంలో ప్రతిపాదనలను కూడా కార్యరూపంలోకి తీసుకువచ్చింది.

సాధ్యాసాధ్యాల విశ్లేషణకు యత్నం

ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో ప్రధానంగా ఆర్థిక పరమైన సాధ్యాసాధ్యాలను హెచ్ఎండీఏ విశ్లేషించేందుకు ప్రయత్నం చేస్తోంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు నమూనాలు సిద్ధం కావడంతో నిర్మాణానికి ప్రధానమైన ఆర్థిక వనరులు, వినియోగం, నిర్వహణ భారం వంటి రెవెన్యూ పరమైన అంశాలపై అంచనా వేసేందుకు ఈ టీఏలూ ఇచ్చే సలహాలను స్వీకరించనున్నారు. దీనికి ఆర్థిక వ్యవహారాల, మంత్రిత్వ శాఖతో పాటుగా ఎన్‌హెచ్ఏఐ గుర్తింపు పొందిన ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ కన్సల్టెన్సీను ఆశ్రయించనుంది. ఈ ఏజెన్సీలు ప్రాజెక్టు ఒప్పంద వ్యవహారాలు, రెవెన్యూ సంబంధిత అంశాలను సమగ్రమైన అవగాహన వచ్చేలా అధ్యయనం చేయించనున్నారు. అదే విధంగా నిర్మాణానికి ముందు డెవలపర్ల విషయంలోనూ ఈ సంస్థ సలహాలు ఇవ్వనుంది. ఆయా కంపెనీల ఆర్థికమైన అంశాలను పరిగణనలోకి సూచనలు చేయనుంది. దీని ద్వారా వచ్చే కంపెనీల నుంచి ఉత్తమ కాంట్రాక్టర్‌ను పారదర్శకంగా ఎంపిక చేసుకునే వీలుంటుందని, పీపీపీ విధానంలో చేపట్టబోయే ప్రాజెక్టులో రెవెన్యూ పరంగా డిజైనింగ్ మార్పులను కూడా సిఫార్సు చేసే అవకాశం ఉంటుందని తెలిపింది. ఈ టీపీ సమర్థవంతమైన ప్రైవేటు సంస్థను ఎంపిక చేసుకునేందుకు సాయపడనుంది.

అడుగు వేసేదెలా?

నిజానికి దాదాపు 16 కిలోమీటర్ల మేర రెండు ప్రధాన మార్గాల్లో నిర్మించనున్న ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో డిజైన్లు ఇప్పటికే ఖరారైనప్పటికీ, కార్యరూపంలోకి తీసుకు వచ్చే విషయంలోనూ హెచ్ఎండీఏ మల్లగుల్లాలు పడుతోంది. ప్రధానంగా నిర్మాణ ఖర్చులు, నిర్వహణ భారంపై అవగాహన లేకపోతే ప్రాజెక్టు వ్యయంపై పూర్తి స్పష్టత లేకనే ప్రత్యామ్నాయంగా టీఏలను నియమించుకుంటున్నట్లుగా తెలుస్తోంది. ప్యాట్నీ నుంచి తూంకుంట వరకు వెస్ట్ మారేడ్‌పల్లి, కార్ఖానా, తిరుమలగిరి, బొల్లారం, అల్వాల్, హకీంపేట్ మీదుగా తూంకుంట వరకు ఉండే 11 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను సమగ్రంగా పరిశీలించనుంది.

ఐఎస్‌టీడీ నగర చాప్టర్ చైర్మన్‌గా శ్రీనివాసరావు

సిటీ బ్యూరో, జూలై 8(నమస్తే తెలంగాణ): ఇండియన్ సొసైటీ ఫర్ ట్రైయినింగ్ అండ్ డెవలప్‌మెంట్ (ఐఎస్‌టీడీ) నగర విభాగం చైర్మన్‌గా బీవీఆర్ఐసీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు, కార్యదర్శిగా అఖిల అలీలు ఎన్నికయ్యారు. బేగంపేటలోని మనోహర్ హోటల్‌లో ఐఎస్‌టీడీ వార్షిక సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించారు. అనంతరం సంఘం అభివృద్ధి, భవిష్యత్తు ప్రణాళికలను ప్రధానంగా చర్చించారు. కొత్త చైర్మన్‌గా ఎన్నికైన శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఐఎస్‌టీడీ కార్యకలాపాలు విస్తృతంగా చేపట్టి, మంచి ఫలితాలు రాబట్టేలా పనిచేస్తామన్నారు.

యూనివర్సిటీలకు శాశ్వత వీసీలను నియమించాలి

10న ప్రొఫెసర్ కోదండరాం ఇల్లు ముట్టడి

సిటీబ్యూరో, జూలై 8(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని 10 విశ్వ విద్యాలయాలకు శాశ్వత వీసీలను నియమించాలని టీజేఎస్ అధ్యక్షులు ప్రొ. కోదండరాం ఇల్లు ముట్టడిస్తామని తెలంగాణ స్టూడెంట్ పరిషత్(టీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షులు బారి అశోక్ కుమార్ తెలిపారు. యూనివర్సిటీలకు శాశ్వత వీసీలు లేకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయని, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా గత ఎన్నికలలో అండగా నిలిచిన కోదండరాం సీఎం రేవంత్ రెడ్డిపై వీసీలను నియమించాలని, ఒత్తిడి తేవాలని ఈ నెల 10న ఇంటిని ముట్టడిస్తున్నామని తెలిపారు.

ఎల్వీ ప్రసాద్‌కు బెస్ట్ ఎన్జీవోస్ పురస్కారం

జూబ్లీహిల్స్, జూలై 8: నేత్ర ఆరోగ్య రంగంలో ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ చేస్తున్న కృషికి గుర్తింపుగా 'బెస్ట్ ఎన్జీవోస్ ఆఫ్ ది ఇయర్' అవార్డు వరించింది. గుర్గావ్‌లోని హయత్ రెజెన్సీలో జరిగిన ప్రతిష్ఠాత్మక గ్లోబల్ సీఎస్ఆర్ అండ్ ఈఎస్జీ అవార్డులలో టాప్ 10 బెస్ట్ ఎన్జీవోస్ ఆఫ్ ది ఇయర్–2024 పురస్కారం ప్రకటించారు. ఎల్వీపీఈఐ తరఫున పబ్లిక్ రిలేషన్స్, డోనర్ ఎఫైర్స్ బృందంలోని మహావీర్ సీ జైన్ పురస్కారాన్ని స్వీకరించారు. ఈపీ ప్రశాంత్ గార్గ్ మాట్లాడుతూ, సిబ్బంది అవిరళ కృషికి ఈ పురస్కారం ఒక నిదర్శనమన్నారు.

హెచ్ఎండీఏ లే ఔట్‌లో సమస్యలు పరిష్కరించాలి

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే బండారి, భగాయత్ కన్వీనర్ మేకల

జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి వినతి

ఉప్పల్, జూలై 8: ఉప్పల్ భగాయత్ హెచ్ఎండీఏ లే ఔట్‌లో సమస్యలను పరిష్కరించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలికి సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సమక్షంలో సోమవారం భగాయత్ అసోసియేషన్ కన్వీనర్ మేకల మధుసూదన్‌రెడ్డి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. వీధి లైట్లు, డ్రైనేజీ, రోడ్ల సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఇంటి నంబర్ల సమస్య ఉందని, రెసిడెన్షియల్ ప్లాట్లలో కమర్షియల్ నిర్మాణాలు చేస్తున్నారని పేర్కొన్నారు. సమస్యలపై దృష్టి సారించాలని జడ్సీని ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యూయార్క్ సదస్సుకు తెలంగాణ విద్యార్థులు: మంత్రి శ్రీధర్ బాబు

సిటీబ్యూరో, జూలై 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్రంలోని అకాడమీ కేంద్రాలు యువతకు అవసరమైన గ్రీనరీ నైపుణ్యాలను సమకూర్చే దిశగా ముందడుగు వేస్తున్నాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు అన్నారు. అందులో భాగంగానే న్యూయార్క్‌లోని యూఎన్ ప్రధాన కార్యాలయంలో జరిగే యాక్టివేట్ ఇంపాక్ట్ సమ్మిట్‌కు తెలంగాణకు చెందిన విద్యార్థులు ఎంపికయ్యారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు తెలిపారు. టీ హబ్‌లో సోమవారం గ్రీన్ స్కిల్స్ అకాడమీ లేవరేజింగ్ ఏఐ గ్రాండ్ ఫినాలేను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదుగురు యువ ఆవిష్కర్తలను విజేతలుగా ప్రకటించారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, ఐక్యరాజ్య సమితి గుర్తింపు పొందిన 1ఎం1బి (వన్ మిలియన్ వన్ బిలియన్)కు తెలంగాణ నుంచి ఐదుగురు యువ ఆవిష్కర్తలను ఎంపిక చేయడం రాష్ట్రానికి గర్వ కారణమన్నారు. ఈ కార్యక్రమం 18–22 సంవత్సరాల వయస్సున్న యువత కోసం రూపొందించబడిందని తెలిపారు. కార్యక్రమంలో ఐటీ, పరిశ్రమల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, ఎమర్జింగ్ టెక్నాలజీ వింగ్ డైరెక్టర్ రమాదేవి లంక, టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, టీ హబ్ సీఈఓ ఎం.ఎస్.రావు, టీ వర్క్స్ సీఈఓ జోగిందర్ తనికెళ్లలు పాల్గొన్నారు.

భూ వివాదంపై చర్యలేవి?

- సర్వే నం. 348/1లో ఏండ్ల తరబడి స్థల తగవు
- భూదేవి హిల్స్‌లో అక్రమంగా రహదారి నిర్మాణం
- భూభాగాన్ని పరిశీలించిన అధికారులు

స్థానికులతో మాట్లాడుతున్న ఏఈ అజేష్, మున్సిపల్ సిబ్బంది

జగద్గిరిగుట్ట, జూలై8: జగద్గిరిగుట్ట భూదేవి హిల్స్‌లో స్మశానం, చెరువు సమీపంలో ప్రైవేటు వ్యక్తులు చేపట్టిన రోడ్డు నిర్మాణం వివాదాస్పంగా మారింది. ఈ మేరకు ఫిర్యాదులు అందగా, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈ అజేష్, టౌన్ ప్లానింగ్ అధికారి సంగీత సోమవారం పరిశీలన చేపట్టారు. భూదేవి హిల్స్ సమీపంలో సర్వే నం.348/1లో పరికి చెరువు ఆనుకొని ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు రహదారి నిర్మాణం ప్రారంభించారు. ప్రభుత్వ భూమిలో ఎలా రోడ్డు వేస్తారని కొందరు అభ్యంతరం వ్యక్తం చేశారు. పరికి చెరువు ఎఫ్టీఎల్‌లో మట్టిపోయడం, ప్లాట్లు విక్రయించేందుకు నిర్మాణాలపై కూడా ఫిర్యాదులున్నాయి. రెండు రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం గౌడ్, కాంగ్రెస్ నేతలు పనులు ఆపివేయించి అధికారులకు తెలియజేశారు. ఈ నేపథ్యంలో తాజాగా అధికారులు పరిశీలన చేపట్టడం చర్చనీయాంశమైంది. తమ ఆధీనంలోని ప్రాంతంలో స్థానికుల సహకారంతో స్మశాన వాటిక వరకు రోడ్డు నిర్మిస్తున్నట్టు కొందరు అధికారులకు తెలిపారు. ఎలాంటి సమాచారం, అనుమతి లేకుండా ఎలా పనులు చేస్తారని అధికారులు వారిని ప్రశ్నించారు. చాలా, ఎత్తుగా ఉన్న ప్రాంతంలో రోడ్డు నిర్మిస్తే ప్రమాదాలు జరుగుతాయని అని పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. పక్కనే ఉన్న స్థలం అక్రమ కట్టడాలకు దారికోసమే నిర్మిస్తున్నారని ఆరోపిస్తున్నారు. పరిశీలించిన వివరాలతో ఉన్నతాధికారులకు నివేదించి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్, టౌన్ ప్లానింగ్ విభాగాల అధికారులు సమన్వయంతో ఏండ్లుగా ఉన్న స్థల వివాదంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పతంజలి కొత్త ఆవిష్కరణలకు నాంది

జూబ్లీహిల్స్, జూలై 8: ఆయుర్వేద, యోగా రంగాలలో ప్రసిద్ధి పొందిన పతంజలి, ఇప్పుడు భరువా సొల్యూషన్స్‌తో కలిసి ఐటీ రంగంలో కొత్త ఆవిష్కరణలకు నాంది పలకనుందని పతంజలి యోగ్ పీఠ్ వ్యవస్థాపకుడు స్వామి రాందేవ్ జీ పేర్కొన్నారు. పతంజలి వర్సిటీ ఆడిటోరియంలో 'కార్పొరేట్ ట్రైనింగ్ ఫర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ అండ్ కోర్ స్కిల్స్' అనే అంశంపై భరువా సొల్యూషన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల వర్క్‌షాప్ ముగింపులో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆచార్య బాలకృష్ణ జీ, భరువా సొల్యూషన్స్ ప్రెసిడెంట్ ఇరేంద్ర ఛాబ్రా, వైస్ ప్రెసిడెంట్ కవీంద్ర సింగ్, పతంజలి ఫుడ్స్ లిమిటెడ్ ఎండీ రామ్ భరత్, పతంజలి ఆయుర్వేద లిమిటెడ్ ఐటీ హెడ్ పవన్ సింగ్‌లు పాల్గొని భరువా సొల్యూషన్స్‌తో పతంజలి ఐటీ రంగంలో సాధించనున్న వృద్ధిని వివరించారు.

లష్కర్ బోనాలకు రూ.25 కోట్లు కేటాయించాలి

మంత్రి పొన్నంను కలిసిన లష్కర్ సాధన సమితి నేతలు

సికింద్రాబాద్, జూలై 8: మహంకాళి బోనాల పండుగ సందర్భంగా నిర్వహణకు అమ్మవారి ఆలయాలకు రూ.25 కోట్లు కేటాయించాలని లష్కర్ జిల్లా సాధన సమితి, అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ అన్నారు. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి, హైదరాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ని సోమవారం కలిశారు. పవన్ కుమార్ అభ్యర్థన మేరకు తెలంగాణ ప్రభుత్వం, బోనాల ఉత్సవాల సందర్భంగా దేవాలయాలకు రూ.20 కోట్లు మంజూరు చేసినందుకు లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు పవన్ కుమార్ గౌడ్ మంత్రిని ఆయన నివాసంలో కలిసి, సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బాలరాజు యాదవ్, శైలేందర్, జగదీశ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, కృష్ణ ముదిరాజ్, జగ్గయ్య పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గౌతమ్

మేడ్చల్ కలెక్టరేట్, జూలై 8: ప్రజావాణిలో వచ్చిన పలు వినతులు, సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. కలెక్టరేట్ హాల్లో సోమవారం ప్రజావాణిని నిర్వహించి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి 124 దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. అనంతరం, అధికారులతో ఆయన మాట్లాడుతూ, జిల్లాలో వన మహోత్సవం కింద అధికారులు వారికి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలని, వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని అధికారులు చేపట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది సమయపాలను పాటించాలని, కలెక్టరేట్‌లో బయోమెట్రిక్ విధానాన్ని త్వరలో అమలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డీఆర్వో హరిప్రియ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నాగారంలో..

నాగారం మున్సిపాలిటీ రాంపల్లి ఆర్టీసీ కాలనీలో 30 ఫీట్ల రోడ్లు ఉన్నాయని, రోడ్లను కబ్జా చేస్తూ ఇండ్ల నిర్మాణం చేస్తున్నారని బీఆర్ఎస్ నేత గండి అంజయ్య గౌడ్, కాలనీ వాసులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రోడ్లను కబ్జా చేస్తున్న ఇండ్లను నిర్మిస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు సంబంధించి 11 వినతులు వచ్చాయని అధికారులు తెలిపారు.

ఖమ్మం జిల్లా వాసి బ్రెయిన్‌డెడ్

అవగాహనతో మరి కొందరికి అవయవ దానం

మందపల్లి రంగారావు (ఫైల్ ఫొటో)

ఖైరతాబాద్/మన్సూరాబాద్, జూలై 8: పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా మరి కొందరికి ప్రాణం పోసేందుకు ఓ కుటుంబం ముందుకు వచ్చింది. బ్రెయిన్ డెడ్ అయిన తమ కుటుంబ సభ్యుడి అవయవాలను దానం చేసి మరి కొందరికి ప్రాణం పోశారు. ఖమ్మం జిల్లా, మంద్రాజుపల్లి, నేలకొండపల్లికి చెందిన మందపల్లి రంగారావు (53) వృత్తి రీత్యా రైతు. గత నెల 28న ఇంట్లో అకస్మాత్తుగా కిందపడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లి పోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఎల్బీనగర్‌లోని కామినేని దవాఖానకు తరలించారు. ఐసీయూలో ఉంచి తొమ్మిది రోజుల పాటు చికిత్స అందించినప్పటికీ అతడి ఆరోగ్యం కుదుటపడలేదు. మందపల్లి రంగారావుకు ఈ నెల 7న మధ్యాహ్నం బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు గుర్తించారు. విషయాన్ని తెలుసుకున్న జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు రంగారావు భార్య రేణుకతో పాటు కుటుంబ సభ్యులను కలుసుకుని అవయవదానంపై అవగాహన కల్పించారు. మరణించిన తమ కుటుంబ సభ్యుడి వలన మరి కొందరి జీవితాల్లో వెలుగులు నిండుతాయని తెలుసుకున్న వారు బ్రెయిన్ డెడ్ అయిన రంగారావు అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. రంగారావుకు చెందిన రెండు కిడ్నీలు, లివర్, రెండు కార్నియాలను దానం చేశారు.

నగరవాసి అవయవదానం

సుబ్రహ్మణ్యం సూర్యనారాయణన్ (ఫైల్)

ముషీరాబాద్‌లోని న్యూనల్లకుంటకు చెందిన సుబ్రహ్మణ్యం సూర్యనారాయణన్ (64) విశ్రాంత బ్యాంకు ఉద్యోగి. కొంత కాలంగా తీవ్రమైన మూత్ర పిండాల సమస్యతో బాధపడుతూ కిడ్నీ డోనర్ కోసం ఎదురుచూస్తున్నారు. అదే క్రమంలో సోమాజిగూడలోని యశోద దవాఖానలో చికిత్స తీసుకుంటున్నాడు. డయాలసిస్‌తో కాలం వెల్లదీస్తుండగా, ఇటీవల ఆయన పరిస్థితి విషమించింది. దీంతో ఎమర్జెన్సీ వార్డులో ఉంచి చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులు ఈ నెల 7న బ్రెయిన్ డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ ప్రతినిధుల కౌన్సెలింగ్‌తో అవయవ దానానికి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. ఆయన శరీరం నుంచి కాలేయం, రెండు కార్నియాలను సేకరించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్

జూబ్లీహిల్స్, జూలై 8: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, డెంగీ జ్వరాల బారిన పడకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్ అధికారులను ఆదేశించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో సోమవారం జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లు, డిప్యూటీ కమిషనర్లు, ఆరోగ్య విభాగాధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. గ్రేటర్ వ్యాప్తంగా దోమల నివారణకు యాంటీ లార్వా ఆపరేషన్స్, దోమల ద్వారా వచ్చే వ్యాధులను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ అమలుచేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో నీరు మార్పుతో వచ్చే సీజనల్ డిసీజెస్‌తో పాటు వర్షపు నీటి నిల్వలతో వృద్ధి చెందే దోమల నివారణకు చెరువులు, నాలాలు, కుంటలు, స్ట్రామ్ వాటర్ డ్రైన్లలో స్ప్రే ఆపరేషన్స్ చేపట్టాలని సూచించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న 268 బస్తీ దవాఖానల పరిధిలో నమోదవుతున్న డెంగీ జ్వరాలపై డిప్యూటీ కమిషనర్లు, సహాయ మెడికల్ ఆఫీసర్లు స్పెషల్ ఫోకస్ పెట్టాలని, వాటి తీవ్రత పెరగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ నెలాఖరు వరకు 148 డెంగీ కేసులు నమోదయ్యాని, గతేడాదితో పోల్చితే తక్కువైనప్పటికీ అప్రమత్తత వీడొద్దన్నారు.

కొడంగల్ కో న్యాయం.. కంటోన్మెంట్ కో న్యాయమా?

ఎంపీగా ఉండి కంటోన్మెంట్‌కు రూపాయి తెచ్చావా?

బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ

విలీనఅంశంపై సీఎం రేవంత్‌రెడ్డికి సూటి ప్రశ్నలు

మారేడ్‌పల్లి, జూలై 8: కంటోన్మెంట్ ప్రాంతంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రేమ, అభిమానం అంటూ ఏదీ లేదని, కొడంగల్ కో న్యాయం, కంటోన్మెంట్ కో న్యాయమా? అని బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. ఈ ప్రాంతానికి గతంలో ఎంపీగా ఉన్న ప్రస్తుత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంటోన్మెంట్ అభివృద్ధి కోసం ఒక్క రూపాయి కూడా నిధులు తీసుకు రాలేదని రామకృష్ణ ఆరోపించారు. విలీనం అంశంపై కంటోన్మెంట్ బోర్డు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విలీనం అంశంపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడనన్నారని, ఆయన ఎంపీగా ఉన్న సమయంలో కంటోన్మెంట్ సమస్యలపై పార్లమెంట్‌లో ఒక్కసారైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యాలయ భవన నిర్మాణ అనుమతుల కోసం రెండుసార్లు మాత్రమే కంటోన్మెంట్ బోర్డు సమావేశానికి హాజరయ్యారని, ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన ఎంపీగా ఉన్న సమయంలో ఒక్కసారి కూడా పట్టించుకోలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాలకు కేటాయించిన మాదిరిగానే ప్రత్యేక నిధులను కంటోన్మెంట్ నియోజకవర్గానికి ఎందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. కొడంగల్‌కు ఏ విధంగా అయితే నిధులు కేటాయించారో, ఇప్పటికైనా కంటోన్మెంట్ ప్రాంతానికి అదే విధంగా నిధులు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆస్తులు, భవనాలు, భూములపై కన్నేశారని ఆయన ఆరోపించారు. సమావేశంలో బీజేపీ నాయకులు వంశ తిలక్, భానుక మల్లికార్జున్, బీఎన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గంగా ఆదేశాల మేరకే.. వారోత్సవాలు

ఉస్మానియాలో ఘనంగా ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవం

ఉస్మానియా ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మి

సిటీబ్యూరో, జూలై 8(నమస్తే తెలంగాణ): ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉస్మానియా దవాఖానలో వారం రోజుల పాటు ప్లాస్టిక్ సర్జరీ అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఉస్మానియా ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్, న్యాబి, అప్సి ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ డాక్టర్ పలుకూరి లక్ష్మి వెల్లడించారు. ఈ సందర్భంగా డా.లక్ష్మి మాట్లాడుతూ, ప్లాస్టిక్ సర్జరీకి ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన కల్పించే ఉద్దేశంతో 13 ఏళ్ల క్రితం తొలిసారిగా కోయంబత్తూర్‌లోని గంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాజ సభాపతి జూలై 15ను జాతీయ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవంగా నిర్వహించారన్నారు. ఆ తరువాత దీనిని ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవంగా ప్రకటించడం జరిగిందని, అప్పటి నుంచి ప్రతి సంవత్సరం జూలై 15ను ప్రపంచ ప్లాస్టిక్ సర్జరీ దినోత్సవంగా పరిగణిస్తున్నట్లు తెలిపారు. అయితే, ఈ సంవత్సరం జూలై 8 నుంచి 15వ తేదీ వరకు వారం రోజుల పాటు ప్లాస్టిక్ సర్జరీ వారోత్సవాలు నిర్వహించాలని గంగా హాస్పిటల్‌కు చెందిన డా. హరి వెంకట రమణి ఇచ్చిన పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా ఆయా తేదీలలో అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఉస్మానియా దవాఖానలో తొలిరోజు ప్లాస్టిక్ సర్జరీకి సంబంధించి 10 శస్త్ర చికిత్సలు నిర్వహించినట్లు వివరించారు. ప్లాస్టిక్ సర్జరీలో ఉన్న ఆరు విభాగాలపై ఒక్కో రోజు ఒక్కో విభాగంపైన అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా పుట్టుకతో వచ్చే తొర్రి, మొర్రి, నడ్డిముక్కు తదితర వాటిని ప్లాస్టిక్ సర్జరీతో సరిచేయవచ్చనే సమాచారంతో కూడిన అవగాహన వీడియోలను మెడికల్, నాన్ మెడికల్ విద్యార్థులకు పంపడం జరుగుతుందన్నారు. ఈ వీడియోలను వారి వారి విద్యా సంస్థల్లో ప్లే చేయడం వల్ల వారికి ప్లాస్టిక్ సర్జరీ ప్రాధాన్యతపై అవగాహన కలుగుతుందని డా.లక్ష్మి తెలిపారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం వేగవంతం కావాలి

అదనపు కమిషనర్ నళినీ పద్మావతి

సిటీబ్యూరో, జూలై 8(నమస్తే తెలంగాణ): ప్రజావాణిలో వివిధ సమస్యలపై వచ్చిన విజ్ఞప్తులను వేగవంతంగా పరిష్కరించాలని అదనపు కమిషనర్ నళినీ పద్మావతి అధికారులకు సూచించారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నగరం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఇచ్చిన విజ్ఞప్తులను నళినీ పద్మావతి స్వీకరించారు. ఫోన్ ఇన్ ప్రోగ్రాం ద్వారా తొమ్మిది విన్నపాలు రాగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపించారు. అందులో టౌన్ ప్లానింగ్, ఇతర సమస్యలు ఉన్నాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 30 విన్నపాలు వచ్చాయి. అందులో అత్యధికంగా 15 వరకు టౌన్ ప్లానింగ్‌కు సంబంధించినవే ఉన్నాయి. మరోవైపు జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో 147 అర్జీలు వచ్చాయి. చార్మినార్–4, సికింద్రాబాద్–18, కూకట్‌పల్లి–61, శేరి లింగంపల్లి–51, ఖైరతాబాద్–1, ఎల్బీనగర్–12 వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రకాంతరెడ్డి, సీసీపీ రాజేంద్రప్రసాద్ నాయక్, ఎస్ఎన్‌డీపీ సీఈ కోటేశ్వర రావు, సీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ పద్మజ, చీఫ్ ఎంటమాలజీ డాక్టర్ రాంబాబు, చీఫ్ వెటర్నరీ డాక్టర్ అబ్దుల్ వకీల్, టాక్స్ వాల్యుయేషన్ ఆఫీసర్ మహేశ్ కులకర్ణి, డిప్యూటీ సీఈ కేఎస్‌రెడ్డి, ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొనానరు.

గోల్కొండలో నిర్వహణ అస్తవ్యస్తం.. తొక్కిసలాట

తొలి బోనం ఏర్పాట్లలో అధికారుల మధ్య సమన్వయ లోపం

కోట ప్రధాన ద్వారం వద్ద భక్తులకు తప్పని ఇబ్బందులు.. కుప్పలు తెప్పలుగా పాదరక్షలు

కోటలో బారికేడ్లను ఇష్టా రాజ్యంగా ఏర్పాటు చేశారని భక్తుల ఆందోళన

గోల్కొండ కోట ప్రధాన ద్వారం వద్ద కుప్పలుగా ఉన్న చెప్పులను తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

మెహిదీపట్నం, జూలై 8: చారిత్రాత్మక గోల్కొండ కోటలో అమ్మవారికి బోనాలు చెల్లించడానికి వచ్చిన భక్తులకు గతంలో ఎన్నడూ లేని విధంగా కోట ద్వారం వద్ద చెప్పులు వదిలి ఇంటికి పారిపోవాల్సిన పరిస్థితిని తెలంగాణ ప్రభుత్వ అధికారులు ఆదివారం రాత్రి కల్పించారు. తెలంగాణ ఆషాఢ మాసం తొలి బోనం సందర్భంగా ఆదివారం గోల్కొండ జగదాంబిక మహంకాళి ఎల్లమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు రాత్రి ఇంటికి వెళ్లే సమయంలో అధికారుల అనాలోచిత చర్యల కారణంగా చెప్పులు వదిలి పరుగుతీశారు. బాల హిస్సార్ వద్ద జరిగిన తొక్కిసలాట వల్ల, పోలీసులు ఝులిపించిన లాఠీల కారణంగా భక్తులు బతుకు జీవుడా.. అంటూ ఎటు దొరికితే అటు పరుగెత్తారు. తెలంగాణ ప్రభుత్వంలో తొలి సీఎం కేసీఆర్ చేసిన ఏర్పాట్లతో గత పదేళ్లలో ఏనాడు ఇలాంటి పరిస్థితిని చూడలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం చేసిన ఏర్పాట్లలో సగం కూడా కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేకపోయిందని పలువురు భక్తులు వాపోయారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని చెప్పిన అధికారులు ఆ స్థాయిలో చేయలేకపోయిందన్నారు. గోల్కొండ కోట గేట్ వద్ద దారిని ఇరుకుగా చేశారని, దీంతో అక్కడ తొక్కిసలాట జరిగి తీవ్ర ఇబ్బందులు పడ్డామని పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. గోల్కొండ కోటకు వచ్చే భక్తులకు విశాలంగా లేకుండా ఎక్కడ పడితే అక్కడ అడ్డదిడ్డంగా బారికేడ్లను ఏర్పాటు చేశారని, దీంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలంగాణ విజయోత్సవాల సమితి అధ్యక్షుడు జెన్న సుధాకర్ తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తొలి బోనంలో జరిగిన తప్పిదాలను గుర్తించి తర్వాత పూజలలో ఇబ్బందులు లేకుండా చూడాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు.

పిల్లలకు చిన్నప్పటి నుంచే లక్ష్యం ఉండాలి

శ్రేష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథలకు దుస్తుల పంపిణీ



జూబ్లీహిల్స్, జూలై 8: పిల్లలు చిన్న నాటి నుంచే ఒక లక్ష్యం కలిగి ఉండాలని శ్రేష్ట ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, సీఈఓ కంకణాల ఎఫ్రాయీము అన్నారు. ఘట్‌కేసర్ సమీపంలోని నారాపల్లి ఫ్రెండ్స్ ఫౌండేషన్‌లో ఆశ్రయం పొందుతున్న అనాథ పిల్లలకు శ్రేష్ట ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్రాయీమ్ మాట్లాడుతూ, సృష్టిలో ప్రతి ఒక్కరి దగ్గర ప్రతిభకు కొదవ లేదని, దానిని వెలికి తీసేందుకు కృషి చేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా పిల్లల గోల్స్ తెలుసుకుని వాటిని సాధించేందుకు చేయాల్సిన ప్రయత్నాలను వివరించారు. ఈ సందర్భంగా పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు బ్రెయిన్ స్టోర్మింగ్ గేమ్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ ఫౌండేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్, హోమ్ కేర్ టేకర్ అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.